క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించాలని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వార్డులో రహదారులు అభివృద్ధి చేయండి

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో రహదారులు అభివృద్ధి చేయాలని జీవీఎంసీ వార్డు అధ్యక్షుడు, ఇన్‌చార్జ్ అలపన కనకరెడ్డి కమిషనర్ సాయికాంత్ వర్మని కోరారు. గురువారం వార్డులో ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో కమిషనర్‌ను కలిసిన కనకరెడ్డి మాట్లాడుతూ వార్డులో నూనెమిల్లువీధి రహదారి అధ్వానంగా ఉందన్నారు. మంచాలవీధి నుంచి పాతబస్టాండ్ వరకు రహదారి నిర్మాణాలు చేపట్టాలన్నారు. జనతారోడ్డు వద్ద రహదారిపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని కోరారు.

ఎన్ఎస్ఎన్ రెడ్డికి ఘన నివాళి



ఎన్ఎస్ఎన్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న పలువురు నేతలు

సీతమ్మధార : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేసిన ప్రజా నాయకుడు మాజీ ఎమ్మెల్యే, విశాఖ నగర పాలక సంస్థ ప్రథమ మేయర్ స్వర్గీయ ఎన్ఎస్ఎన్ రెడ్డి అని పలువురు కొనియాడారు. ఎన్ఎస్ఎన్‌రెడ్డి స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో 94వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ గాంధీ పార్కులో ఉన్న ఆయన విగ్రహానికి వేమన సంక్షేమ సంఘం నాయకులు, బీజేపీ నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నగర బీజేపీ అధ్యక్షుడు రవీంద్రరెడ్డి, శ్రీవేమన సంక్షేమ సంఘం సభ్యులు, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ బాకి శ్యాంకుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ధర్మేంద్రరెడ్డి , పులగం సూర్యనారాయణరెడ్డి, సత్తి సుబ్బారెడ్డి, దల్లి రామకృష్ణరెడ్డి, లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో పండిత సదస్సు



సదస్సులో పాల్గొన్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పరిధిలోని కొండదిగువ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పండిత సదస్సు విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు వెంకన్న, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి శేషతల్పంపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. స్వామివారి వైభవాన్ని పండితులంతా కీర్తించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సదస్సులో పాల్గొన్నారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు చక్రవర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు.



తన మ్యాజిక్‌తో ఆకట్టుకుంటున్న బీఎస్ రెడ్డి

భలే మాయగాళ్లు

నేడు ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం

అబ్రకదబ్ర అని మంత్రదండం తిప్పారో.. అద్భుతాలు జరిగిపోతాయి. మాయాలేదు, మర్మమూ లేదంటూనే కనికట్టుతో ఓ పట్టుపడతారు. ఇంద్రజాల, మహేంద్ర జాల, గజకర్ణ, గోకర్ణ, టక్కు, టమార విద్యల్లో ఆరితేరిన మాయగాళ్ల దినోత్సవం నేడు. మ్యాజిక్‌కు కులగోత్రాలు లేవు. ఎనిమిదేళ్ల కుర్రాడి నుంచి 80 ఏళ్ల వృద్ధుల వరకూ అందరికీ ఇది ఆనందం పంచుతుంది. లేనిది ఉన్నట్టు చూపడం. ఉన్నది లేనట్టు చూపడం. అదే మాయాజాలం. –దాబాగార్డెన్స్

ఇక్కడ ఉన్న వస్తువు..వేరే చోట కనిపించడం. కంటికి కనింపించని వస్తువు కళ్లకు కట్టినట్టు చూపడం. చేతి రుమాల్లోంచి పావురాలు సృష్టించడం. బొమ్మ గిటార్‌లో నుంచి గిటార్‌ను సృష్టించి పాప్ **సంగీతాన్ని అందించడం. ఒక న్యూస్ పేపర్లో నీరు పోసి అందులోంచి రక రకాల పువ్వులు, రంగు రంగుల చేతి రుమాళ్లు వంటి సృష్టించడం అద్భుత** ప్రక్రియ. భారతీయ సంస్కృతి 64 కళల సమాహారం. అందులో ఇంద్రజాలం ఒకటి. ఈ కళకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన వారు..ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు పీసీ సర్కార్ సీనియర్. ఆయన జయంతిని పురస్కరించుకుని ఏటా ఫిబ్రవరి 23న ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. విజ్ఞానంతో కూడిన వినోదాన్ని అందించడమే తమ లక్ష్యమని ఇంద్రజాలికులు చెబుతున్నారు. ఇంద్రజాలం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోందని, ఏకాగ్రత పెంచుతుందనేది వారి భావన. పెట్టెలో నుంచి అమ్మాయిని తీయడం. చేతులకు సంకెళ్లు వేసిన మనిషిని పెట్టెలో నంచిలో పెట్టి వేయగా ఆయన ప్రేక్షకుల మధ్య జాతీయ జెండాతో కనిపించడం..పేక ముక్కలను అనేక రకాలుగా తయారుచేయడం వంటివి ఎన్నో..ఎన్నెన్నో మెజీషియన్లు తరచూ మనకు చూపిస్తున్నారు.



చిన్నారులతో మ్యాజిక్ చేస్తూ నృత్యంతో అలరిస్తున్న భాషా



పేక ముక్కలతో మ్యాజిక్

అన్ని విభాగాల్లో రాణిస్తేనే..



ఇంద్రజాలం నాలుగు భాగాలుగా ఉంటుంది. క్లాసిక్, కన్సూరింగ్, క్లోజప్, ఎలీసన్ విభాగాలుగా ఉంటున్నాయి. పురాతన పద్ధతిలో మామిడి టెంకలు నాటి అప్పటికప్పుడే మొక్కలు పుట్టించడం, వాటికి కాయలు కాయించడం వంటివి క్లాసిక్‌గాను, ఎదుట వ్యక్తితో మాట్లాడుతూనే అతి దగ్గరగా ఇంద్రజాలం ప్రదర్శించడానిన క్లోజప్‌గా గుర్తించారు. ఖాళీ డబ్బాల నుంచి వివిధ రకాల వస్తువులు తీయడం ఎలీసన్‌గాను, ఏదైనా ఒక వస్తువు స్వరూపాన్ని మార్చి తిరిగి దాని పూర్వపు స్వరూపానికి తేవడాన్ని కన్సూరింగ్‌గా గుర్తించారు. ఏ ఇంద్రజాలికుడైనా వీటిని ప్రదర్శించాల్సిందే అంటున్నారు.. ప్రముఖ ఇంద్రజాలికుడు బీఎస్ రెడ్డి.

–బీఎస్ రెడ్డి, ఇంద్రజాలికుడు, ఇండియన్ మ్యాజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు

మ్యాజిక్‌తో పాటు హాస్యం పండించాలి



నగరంలో ప్రొఫెషనల్ మెజీషియన్‌గా గుర్తింపు పొందిన ఒకరిలో నేనూ ఉన్నాను. పదుల సంఖ్యలో యాక్ట్‌లు చేసి మెస్మరైజ్ చేయగలను. ఇప్పటి వరకు 4 వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చాను. జాదూ సామ్రాట్ అవార్డు విజేతను, సేవల్లో కూడా ముందున్న కళాకారుడిగా గుర్తింపు ఉంది. ఇండియన్ మ్యాజిక్ అకాడమీ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలో మూఢనమ్మకాలను పారదోలేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నాను. క్షుద్ర విద్యలు, బాబాలు, దెయ్యాల వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నా. సాధారణ మ్యాజిక్‌తో పాటు కామెడీ మ్యాజిక్‌లు చేయాలన్నది లక్ష్యం. మూడు పీజీలు చేశాను. ఏయూలో ఎంఎస్సీ సైకాలజీ కూడా పూర్తి చేశాను.

–అన్వర్ భాషా, మెజీషియన్

ఆరోగ్య సురక్ష..పేదలకు భరోసా

- 437 మందికి వైద్య పరీక్షలు



పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న లబ్ధిదారులు



రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

అల్లిపురం: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన ఏర్పడింది. కొబ్బరితోట డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో ప్రజలు భారీగా పాల్గొన్నారు. సుమారు 437 మందిని వైద్యులు పరీక్షించారు. వారిలో ఒకరికి ఊపిరితిత్తుల సమస్య ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అలాగే పరీక్షలు చేసిన వారికి మందులు కూడా ఉచితంగా అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారంపై రోగులకు అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు పోషకాహారం నిమిత్తం ఏఏ ఆహార పదార్థాలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి పాల్గొన్నారు.

కంటి సమస్యతో వచ్చా



మాది బంగారమ్మమెట్ట. కంటి సమస్యతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వచ్చా. వైద్యులు పరీక్షలు చేశారు. అవసరమైన సూచనలు చేశారు. మందులు అందజేశారు.

– సమ్మంగి సత్యవతి

మెరుగైన వైద్యం అందించారు



మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నా. జగనన్న ఆరోగ్య సురక్ష అవగాహన కార్యక్రమంలో వైద్య శిబిరానికి రమ్మని టోకెన్ ఇచ్చారు. వైద్యులు పరీక్షించి అవసరమైన మందులు ఇచ్చారు.

– ఎస్.రాజేశ్వరి, బంగారమ్మమెట్ట

చక్కగా చూశారు



వైద్య శిబిరంలో వైద్యులు చక్కగా పరీక్షలు చేశారు. కంటి సమస్య ఉండడంతో ఆరోగ్య సురక్ష శిబిరానికి వచ్చా. వైద్యులు సూచనలు, సలహాలు అందజేశారు. పరీక్షలు చేసి మందులు అందజేశారు.

– పి.అప్పలనాయుడు

'ఆవిష్కరణలు–అభివృద్ధి'పై జాతీయ సదస్సు ప్రారంభం



ఏయూ వీసీ ప్రసాదరెడ్డిని సత్కరిస్తున్న డాక్టర్ షైజీ, నిర్వాహకులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళ కళాశాల బోటనీ విభాగం ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం 'ఆవిష్కరణలు–అభివృద్ధి సాంకేతికతలు' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ సహసంచాలకులు డాక్టర్ పీవీకే జగన్నాథరావు సంయుక్తంగా సదస్సు ప్రారంభించారు. ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ యంత్రాల పాలనలో దూసుకుపోతున్న తరం మనది... కృత్రిమ మేధ యొక్క అభివృద్ధి ప్రతి రంగంలోనూ ఉపయోగపడు తోందనన్నారు. ఈ రంగంలో ఆదర్శప్రాయమైన పురోగతి ఉందన్నారు. మరో అతిథి జగన్నాథరావు మాట్లాడుతూ పంట అనంతర దిగుబడిలో నష్ట నివారణకు సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, సదస్సు కన్వీనర్ మాణిక్య కుమారి, డాక్టర్ పి.కె జయలక్ష్మి, డాక్టర్ పద్మసుందరి, సిస్టర్ హేమ, డాక్టర్ నాగరాజు, కార్యవర్గ సభ్యులు డాక్టర్ హరిణి, డాక్టర్ వీరబ్రహ్మం, డాక్టర్ మేరీ అనుపమ, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ సుధ, పలు కళాశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేడే మాఘ పౌర్ణమి జాతర



మాధవస్వామి

పరవాడ: మాఘపౌర్ణమి పూజలకు ముత్యాలమ్మపాలెం తీరం సిద్ధమైంది. శుక్రవారం వేలాదిగా తరలిరానున్న భక్తుల కోసం మాధవస్వామి ఆలయంతో పాటు తీరంలో విస్తృత ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ సూరాడ సోమునాయుడు చెప్పారు. మాధవస్వామికి శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇక్కడ పుణ్య స్నానాలు ఆచరించడానికి శుక్రవారం రాత్రి జాగరణ చేయడానికి విశాఖ, అనకాపల్లి, గవర్ల అనకాపల్లి, తోటాడ, వెంకటాపురం, పరవాడ, సబ్బవరం, పెదముషిడివాడ, లంకెలపాలెం, సాలాపువానిపాలెం, స్టీల్‌ప్లాంట్, ఎన్టీపీసీ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తీరానికి చేరుకుని రాత్రింతా జాగరణ చేసి శనివారం వేకువ జామున తీరంలో పుణ్య స్నానాలు ఆచరిస్తారు. స్నాన ఘట్టాల వద్ద మహిళలకు దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత





లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ పేదల ప్రభుత్వమని, వారి సంక్షేమం కోసం నిరంతరం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ప్రజాదర్బార్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఆయన గురువారం చెక్కులు అందజేశారు. 32వ వార్డు అల్లిపురం కరణాల వీధికి చెందిన రాజాబత్తుల రాజేశ్వరి మోకాళ్ల ఆపరేషన్‌కు ప్రైవేటు హాస్పటల్‌లో వైద్యం నిమిత్తం కోరగా రూ.70వేలు చెక్‌ను అందజేశారు. 42వ వార్డు రైల్వే న్యూకాలనీకి చెందిన కత్రి అమ్మన్నకు రూ.25వేలు అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలిసిన వెంటనే స్పందించే ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఆరోగ్య శ్రీ వర్తించని వాటికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మూలే రామిరెడ్డి, కృష్ణవేణి, భాను, లక్ష్మి, ఆళ్ల శ్రీనివాసు, ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు చక్రవర్తి, శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్లు పిళ్లా శ్రీనివాసరావు, సిరిపురపు కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

నిస్వార్థంతో పనిచేసిన వారందరికీ గుర్తింపు



ప్రమాణస్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్: పాత నగరంలో బ్రిటిష్ వారితో నిర్మించిన అతి పురాతన కింగ్ ఎడ్వర్డ్ కార్నేషన్ మెమోరియల్ కురుపాం మార్కెట్ దేవదాయ ధర్మదాయ శాఖ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, 39వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కొల్లి సింహాచలం ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ తిత్తి కృష్ణ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేశారు. కురుపాం మార్కెట్ కార్యనిర్వహణాధికారి శేఖర్ బాబు సమక్షంలో నిర్వహించిన ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ జెండా మోసి నిస్వార్థంగా సేవలందించిన వారందరికీ గుర్తింపు ఇచ్చామని తెలిపారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తోందన్నారు. సభ్యులుగా మైలపల్లి ఆదినారాయణ, ముత్తి శ్రీను, నాగల రాజేశ్వరి, పోలవరపు లక్ష్మి, కండిపల్లి ఆదిలక్ష్మి, స్వర్ణపూడి గాయత్రీదేవి, కస్పా కుమారి, గారా చిన తాతబ్బాయి ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట పద్మావతి, కోడూరు అప్పలరత్నం, పార్టీ నాయకులు సత్యనారాయణ, లండా రమణ, కదిరి అప్పారావు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కులు కాలరాస్తున్న కేంద్రం

- ఐద్వా ఆలిండియా ప్రధాన కార్యదర్శి మరియం థావలే



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఐద్వా ఆలిండియా ప్రధాన కార్యదర్శి మరియం థావలే

దాబాగార్డెన్స్: బీజేపీ ప్రభుత్వం మహిళల హక్కులు కాలరాస్తోందని, మోదీ ప్రభుత్వం పేదోల డబ్బులు దోచుకుని, అంబానీ, ఆదానీలకు ధారపోస్తోందని ఐద్వా ఆలిండియా ప్రధాన కార్యదర్శి మరియం థావలే ఆరోపించారు. మోదీకి రెండు నెలలే గడువుందని..రానున్న ఎన్నికల్లో మహిళలందరూ గుణపాఠం చెప్పనున్నారని ఆమె తెలిపారు. ఐద్వా అఖిల భారత జాతీయ సమావేశాలు విశాఖ వేదికగా ఈ నెల 25వరకు నిర్వహించనున్న సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం మధ్యాహ్నం నగరంలోని సరస్వతీపార్క్ నుంచి దాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహ కూడలి, ఎల్ఐసీ జంక్షన్ మీదుగా వైఎస్సార్ సెంట్రల్ పార్క్ వరకు వివిధ కళా నృత్యాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మరియం థావలేతో పాటు ఐద్వా ఆలిండియా కోశాధికారి ఎస్.పుణ్యవతి, రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి, ప్రధాన కార్యదర్శి రమాదేవి, రాష్ట్ర నాయకులు వై.సత్యవతి, బి.పద్మ, డాక్టర్ జి.ప్రియాంక, ఆర్.విమలతో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో థావలే మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం దేశ ప్రజలకు 5 కేజీల బియ్యం రేషన్ డిపోల ద్వారా సరఫరా చేసి పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పడం సిగ్గుచేటన్నారు. దేశంలో విమానపు చార్జీలు, ఏసీ రైళ్ల చార్జీలు తగ్గించి, సాధారణ ప్రజలు ప్రయాణించే రైల్వే, బస్సు ఇతర రవాణా చార్జీలు భారీగా పెంచడాన్ని ఆమె తప్పుబట్టారు. పెట్రోల్, డీజిల, వంట గ్యాస్, విద్యుత్, ఇతర నిత్యావసర ధరలు భారీగా పెంచుతున్న మోదీ, జగన్‌లు కార్మికుల వేతనాలు మాత్రం పెంచడం లేదన్నారు. రైతులు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేయని ప్రభుత్వాలు, ఆదాని, అంబానీల వంటి కార్పొరేట్ సంస్థలకు రూ.15 లక్షల కోట్లు రుణమాఫీ చేసిందంటే ఈ ప్రభుత్వాలు ఎవరి పక్షాన ఉన్నాయో అర్థం చేసుకోవాలన్నారు. దేశంలో మహిళలపై లైంగిక దాడులు, హత్యలకు పాల్పడేవారిని మోదీ ప్రభుత్వం సన్మానాలు చేయడం దేశం తలదించుకునేలా చేసిందన్నారు.

ప్రభుత్వ వారధులు వలంటీర్లు



సేవ రత్న అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న కనకరెడ్డి

జగదాంబ: ప్రభుత్వ వారధులు వలంటీర్లని జీవీఎంసీ 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి అన్నారు. సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడానికి వలంటీర్లు సైనికుల్లా పనిచేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాల మేరకు గురువారం ఇందిరా ప్రియదర్శిని క్రికెట్ స్టేడియంలో సేవ మిత్ర, సేవ రత్న అవార్డు గ్రహీతలను సత్కరించారు. వార్డులో అర్వై మందికి సేవ పురస్కారాలకు ఎంపికయ్యారన్నారు. అంకితభావంతో పనిచేసిన వారికి ప్రభుత్వం నాలుగేళ్లుగా ప్రోత్సహకాలు అందజేస్తోందన్నారు. వలంటీర్ల సీఈవో కృపానంద్, వార్డు వైస్సార్‌సీపీ నాయకులు సిటీ సెక్రటరీ ఆదివిష్ణురెడ్డి , వాసర్ల సుబ్రహ్మణ్య, మళ్ల బుజ్జి, రంగాల రవికుమార్, రూప, పుష్ప, గంగాధర్, రమణమ్మ, కనకమ్మ, నాగిరెడ్డి కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి



అవార్డు పొందిన వలంటీర్‌ను సత్కరిస్తున్న మండల అధ్యక్షుడు బాపూ ఆనంద్ తదితరులు

దాబాగార్డెన్స్: వలంటీర్ల సేవలు ఎనలేనివని విశాఖ దక్షిణ నియోజకవర్గ మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ కొనియాడారు. వలంటీర్ల వందనం కార్యక్రమంలో భాగంగా సేవా వజ్ర, సేవా రత్న అవార్డులు పొందిన వలంటీర్లకు గురువారం 31వ వార్డు పరిధి డ్వాక్రా బజార్లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆరు సచివాలయాల పరిధి డ్వాక్రా బజార్, పద్మానగర్, భీమ్‌నగర్, గొల్లలపాలెం, చిలకపేట, ఎస్‌బీఐ కాలనీ సచివాలయానికి సంబంధించి సేవా వజ్ర, సేవా రత్న అవార్డులు పొందిన వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బాపూ ఆనంద్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన అవార్డులతో మరింత బాధ్యత వలంటీర్లపై పెరిగిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అందుకోవడంతో పాటు సంక్షేమాన్ని లబ్ధిదారులకు సకాలంలో అందజేసి వారి అభిమానాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆర్‌పీ వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ కన్వీనర్లు కొండ భవాని, గారి రాంబాబు, బాబూరావు, కందిరేగుల నాయుడు పాల్గొన్నారు.

25న శ్రీ కృష్ణదేవరాయలు, రంగా విగ్రహాల ఆవిష్కరణ

దాబాగార్డెన్స్: విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధి గోపాలపట్నం పద్మనాభనగర్‌లో ఈ నెల 25న శ్రీ కృష్ణదేవరాయలు, వంగవీటి మోహనరంగా విగ్రహాల ఆవిష్కరణ నిర్వహించనున్నట్టు శ్రీకృష్ణదేవరాయ కాపు, తెలగ, బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గండ్రెడ్డి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కంపర సత్తిబాబు తెలిపారు. పశ్చిమ నియోజకవర్గం 92వ వార్డు పద్మనాభనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న కాపు కల్యాణ మండపానికి సుమారు రూ.2 కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మంజూరు చేయించిన వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 25న ఆడారి అభినందన సభ ఏర్పాటు చేసినట్టు వారు వెల్లడించారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. 2018లో శంకుస్థాపన చేసిన కాపు భవన్ నిర్మాణం నిలిచిపోయిందని, కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు సహకారంతో ఆడారి ఆనంద్‌కుమార్‌తో చర్చించి ప్రభుత్వ నిధులు మంజూరు చేయించారన్నారు. సమావేశంలో సంఘం గౌరవ సలహాదారుడు గంట్ల శ్రీనబాబు, తూర్పుకాపు సంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు, విగ్రహ దాతలు సురేష్, శ్రీధర్ పలువురు సభ్యులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎం.రాజశేఖర్, కె.నాగరాజు, డి.మోహన్, గేదల మురళీకృష్ణ, జి.నాగరాజు పాల్గొన్నారు.